ప్రజాశక్తి

శుక్రవారం 5 డిసెంబర్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు



ఘోర రోడ్డు ప్రమాదం

నాదెండ్ల మండలం గణపవరం వద్ద గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. ట్రాక్టర్ ఇంజన్లతో ఒంగోలువైపు వెళ్తున్న కంటైనర్‌ను విద్యార్థులున్న కారు వెనకనుండి వేగంగా ఢీకొట్టడంతో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించారు. మృతుల్లో రామిరెడ్డి, యశ్వంత్, శ్రీకాంత్, మహేష్, వాసు ఉన్నారని, వీరు వినుకొండ, పిడుగురాళ్ల అద్దంకి ప్రాంతాలకు చెందినవారని తెలిసింది. సమాచారం అందుకున్న వెంటనే నాదెండ్ల పోలీసులు అక్కడికి చేరుకుని కారులో ఇరుకుపోయిన మృతదేహాలను వెలికి తీసి చిలకలూరిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇందుకుగాను గంటకుపైగా సమయం పట్టింది. అనంతరం అప్పటికే భారీగా వాహనాలు నిలిచిపోవడంతో క్రమబద్ధీకరించారు. ప్రజాశక్తి-నాదెండ్ల



మాట్లాడుతున్న తమ్మారెడ్డి భరద్వాజ

శారదానికేతనం మరో వెయ్యేళ్లు కొనసాగాలి

సినీ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ

ప్రజాశక్తి-గుంటూరు

నూరేళ్ల చరిత్రగల శ్రీశారదా నికేతనంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినుల భవిష్యత్తు గురించి ప్రభుత్వాలు, నగర పెద్దలు ఆలోచించి మరో వెయ్యేళ్లపాటు కొనసాగేలా చర్యలు చేపట్టాలని సినీ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ పిలుపునిచ్చారు. గురువారం బ్రాడీపేటలోని

2లో

రేషన్ అక్రమాలపై మొద్దునిద్ర

మాఫియాతో కొనసాగుతున్న సర్దుబాటు - సిసికెమెరాలు పెట్టాలన్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రేషన్ డీలర్ల అక్రమాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఎమ్‌డియు వాహనాల్లో రేషన్ సరఫరా సరిగా లేదని డీలర్లకు ప్రభుత్వం పంపిణీ బాధ్యతలను పునరుద్ధరించినా డీలర్లు కూడా ఎమ్‌డియు వాహనదారుల బాటలోనే నడుస్తున్నారు. అంతేగాక కొత్త అక్రమాలకు తెరలేపారు. ప్రభుత్వం ఇచ్చిన ఒన్ నేషన్, ఒన్ రేషన్ నినాదంతో పోర్టబులిటీ ద్వారా ఎవరు ఎక్కడయినా రేషన్ తీసుకోవచ్చుననే విధానాన్ని జిల్లాలోని పలువురు డీలర్లు దుర్వినియోగం చేసి పేదలకు బియ్యం లేవని నో స్టాక్ బోర్డులు పెడుతున్నారు. ఒకటో తేదీ నుంచి 15 వ తేదీ వరకు రేషన్ బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా ప్రతి నెల ఐదో తేదీ లోపే నో స్టాక్ బోర్డులు వెలుస్తున్నాయి. పోర్టబులిటీ విధానం ద్వారా ఎక్కడి వారు అయినా తమకు దగ్గరలోని డిపో నుంచి రేషన్ బియ్యం తీసుకునే అవకాశాన్ని కల్పించగా దీనిని పలువురు డీలర్లు



అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

తప్పుడు మార్గంలో తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. తమ డిపోలో ఉన్న సరుకు అయిపోయిందని డిపో పరిధిలోని వినియోగదారులకు మొండి చేయి చూపుతున్నారు. స్టాక్ అయిపోతే కొత్త స్టాకు ఇవ్వడం లేదని పలువురు డీలర్లు చెబుతున్నారు. దీంతో ఎవరికి తోచిన విధంగా వారు బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడుతున్నారు.

డిపోలను తనిఖీ చేసి అక్రమాలను నిరోధించాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా నెలవారీ మామూళ్ల తీసుకుని మిన్నంకుండి పోతున్నారు. అధికారులు, డీలర్ల తీరుపై గుంటూరులో ఎమ్మెల్యే గళ్లా మాధవి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. డిపోల వద్ద జరుగుతున్న అక్రమాలపై పరిశీలించేందుకు ప్రతిచోటా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆమె జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. అక్రమ మార్గంలో రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్న రేషన్ మాఫియా ప్రతినిధులు తాము ప్రజా ప్రతినిధులకు నెలకు రూ.10 లక్షలు

2లో



34 ఏళ్లుగా మా సమస్య

- పరిష్కరించి సంబరాలు చేసుకోండి
- దీక్షలు ఏడాది పూర్తయిన సందర్భంగా ఎసిసి సిమెంట్ కార్మికుల నిరసన ప్రదర్శన
- ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్

ప్రజాశక్తి- తాడేపల్లి

ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా సంబరాలు చేసుకుంటున్న ప్రభుత్వం... 34 ఏళ్ల అపరిష్కృతంగా ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను పరిష్కరించి సంబరాలు చేసుకోవాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి అన్నారు. న్యాయమైన తమ డిమాండ్ల సాధన కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రకాష్ నగర్ సెంటర్లో గురువారం భారీ నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ అధ్యక్షతన జరిగిన సభలో రమాదేవి మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, మొండిగా వ్యవహరిస్తున్న యాజమాన్యాన్ని ఒప్పించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల శ్రమ ద్వారా రూ.వేల కోట్లు కూడబెట్టుకున్న యాజమాన్యం

2లో

లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ ఎఐ

4లో

ధాన్యాన్ని మద్దతు ధరకు కొనాలి : రైతుసంఘం

ప్రజాశక్తి - పెదనందిపాడు

ధాన్యం రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రమైన కాకుమానులో నాయకులు గురువారం పర్యటించి, వరి ధాన్యాన్ని, రైతులు ఆరబోసిన కల్లాల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర బస్తా రూ.1792 ఉందని, తేమశాతం అధికంగా ఉందనే సాకుతో ధాన్యాన్ని కొనేందుకు ప్రభుత్వం విముఖత చూపుతుండడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు రూ.1300కు తెగనమ్ముకుంటున్నారని అన్నారు. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ఎప్పుడు వర్షం పడి ధాన్యం తడిసిపోతుందోనని భయపడి రైతులు ప్రైవేట్ వ్యాపారస్తులకు అమ్ముకుంటున్నారని తెలిపారు. మొదట్లో రూ.1400కు కొన్న వ్యాపారస్తులు ప్రస్తుతం రూ.1300కే కొంటున్నారని చెప్పారు. ఎకరానికి



ఖర్చులు రూ.30 వేలు, కౌలు రూ.20 వేలు మొత్తంగా రూ.50 వేలు అవుతుండగా 25-30 బస్తాల దిగుబడే వచ్చిందని, 30 బస్తాల ధాన్యాన్ని అమ్మితే రైతుకు రూ.39 వేలే వస్తున్నాయని, ఎకరాకు రూ.11 వేల నష్టం వస్తోందని వివరించారు. మద్దతు ధరకు కొంటే కొంతైనా నష్టం తగ్గుతుందన్నారు. తేమ శాతం ఎంత ఉన్నా మద్దతు ధరకు ప్రభుత్వమే కొనాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, డి.రమేష్‌బాబు, జె.రామారావు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్ల నిబంధనలతో రైతులకు ఇక్కట్లు

ప్రజాశక్తి-గుంటూరు

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) పత్తి కొనుగోళ్లకు విధించిన నిబంధనలతో రైతులు, కౌలు రైతులకు శాపంగా మారాయని రైతుసంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ అన్నారు. బ్రాడీపేటలోని సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో లేవని, ప్రైవేటు మిల్లుల్లో ఏర్పాటు చేశారని, మిల్లు దగ్గరికి వెళితే తేమ శాతం తప్పుగా చూపించటం, రకరకాల కొర్రీలు పెడుతుండటంతో మద్దతు ధర కంటే రూ.2వేలు తక్కువకే దళారులకు విక్రయించుకోవాల్సి వస్తోందని వివరించారు. బాడుగ ఖర్చు, గోతాల ఖర్చు, కూలీల ఖర్చు, చివరికి తేమ శాతం ఎక్కువని 4 నుండి 5 కేజీల వరకూ కోత వంటి రకరకాల



విలేకర్లతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ఆంక్షల నేపథ్యంలో గ్రామాల్లోనే దళారులకు తక్కువ రేటుకే తెగనమ్ముకుంటున్నారని తెలిపారు. పొమ్మనకుండా పొగబెట్టిన చందంగా నిబంధనలు ఉన్నాయన్నారు. కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు బి.రామకృష్ణ మాట్లాడుతూ ఇతర జిల్లాలతోపాటు, తెలంగాణ నుండి కూడా ఇక్కడికి పత్తి తీసుకొచ్చే అవకాశం కల్పించటంతో జిల్లా

2లో



బాల్య వివాహాల రహిత జిల్లా కోసం కృషి చేయాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేటలోని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కార్యాలయంలో గురువారం పల్నాడు జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారి ఆధ్వర్యంలో బాల్ వివాహ్ – ముక్త భారత్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి శౌరిరాజు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు, ప్రోహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్-2006 చట్టం గురించి వివరించారు. వివాహ వయస్సు అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్ళుగా నిర్ణయించారన్నారు. బాల్య వివాహాలు ప్రోత్సహించినా, వివాహానికి హాజరైనా రెండేళ్ల జైలు శిక్ష, జరిమాన తప్పదన్నారు. బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే గ్రామ స్థాయిలో గ్రామ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి మండల స్థాయిలో సిడిపిఓ, తహశీల్దార్, ఐసిడిఎస్ సూపర్వైజర్, డివిజనల్ స్థాయిలో ఆర్‌డిఓ, సబ్ కలెక్టర్ జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. పల్నాడు జిల్లాని బాల్య వివాహ రహిత జిల్లాగా చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీడీ ఎం.ఉమాదేవి, నరసరావుపేట సిడిపిఒ ఎస్.కాంతకుమారి, మెడికల్ డిపార్ట్మెంట్, పోలీస్ డిపార్ట్మెంట్, మహిళా పోలీస్ సిఐ డిఆర్.డిఏ, మిషన్ శక్తి కోఆర్డినేటర్, బాలల పరిరక్షణ విభాగం, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్ల నిబంధనలతో రైతులకు ఇక్కట్లు

(మొదటి పేజీ తరువాయి)

రైతులకు న్యాయం జరగట్లేదన్నారు. స్లాట్ ఎప్పుడు నమోదు చేసుకున్నారో కూడా రైతులకు తెలియకుండా సిసిఐ దళారులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గ్రామాల్లోనే రైతుల వద్ద నేరుగా కొనుగోలు చేస్తే ఉపశమనం లభిస్తుందన్నారు. స్లాట్ నమోదు విధానం ఎత్తివేసి, రైతులకు అనుకూలమైన పద్ధతి అవలంబించాలని కోరారు. తేమ శాతం 20 వరకూ అనుమతించేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. అకాల వర్షాలతో తుపానుతో పత్తిపంట సరిగా పండక, 15 క్వింటాళ్లకుపైగా రావాల్సిన దిగుబడి 3 నుండి 4 క్వింటాళ్ల మాత్రమే వచ్చిందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిబంధనల పేరుతో ఇబ్బంది పెట్టకుండా పత్తి కొనుగోళ్ళ చేపట్టాలని డిమాండ్ చేశారు. సిసిఐలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలన్నారు. అమెరికా నుండి ఆంక్షలు లేని పత్తి దిగుమతులు చేసుకోవటం సరికాదని, దేశ రైతులకు అండగా నిలవాలని కోరారు. సమావేశంలో నాయకులు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలు కోసం జలదీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కూటమి ప్రభుత్వం మైనార్టీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ గురువారం ఎంహెచ్.పిఎస్ రాష్ట్ర కార్యదర్శి, ఎంఐఎం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ వలి ఆధ్వర్యంలో వల్లప్ప చెరువులో దిగి జలదీక్ష నిరసన చేపట్టారు. మస్తాన్ వలి మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ ముస్లిం మైనార్టీలకు ఎటువంటి ఆంక్షలు లేకుండా దుల్హన్ పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. అధికారం లోకి రాగానే ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేసి వడ్డీ లేని రుణాలు అందిస్తామన్నారని గుర్తు చేశారు. అధికారం లోకి వచ్చి ఏడాదిన్నార అయినా ఇప్పటికీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించి ముస్లిములకు ఇచ్చిన హామీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు కరిముల్లా, పట్టణ అధ్యక్షుడు షేక్. మౌలాలి, సెక్రెటరీ జికియా పాల్గొన్నారు.



శారదానికేతనం మరో వెయ్యేళ్లు కొనసాగాలి

(మొదటి పేజీ తరువాయి)

శారదానికేతనం ప్రాంగణంలోని ఉన్నవ లక్ష్మీనారాయణ 148వ జయంతిని పురస్కరించుకొని అమరావతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మాలపల్లి' నవలా దినోత్సవానికి జన చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మా ధనుంజయరెడ్డి అధ్యక్షత వహించారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ ఆనాటి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులకు అద్దంపట్టేలా మాలపల్లి నవలను ఉన్నవ లక్ష్మీనారాయణ రచించారన్నారు. ఆ రోజుల్లో ఉన్నతమైన ఆశయాలతో ఉన్నవ దంపతులు స్థాపించిన శ్రీ శారదానికేతనం భావితరాలకు కూడా సేవలందించేలా ప్రభుత్వాలు, సేవా తత్పరులు సహకారం అందించాలని కోరారు. మాజీమంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ ఉన్నవ లక్ష్మీనారాయణ ఒక మహర్షి అని, 103 ఏళ్ల క్రితమే నాటి సమాజంలో వేళ్లూనుకున్న రుగ్మతులను, లోపాలను స్పృశిస్తూ తన నవలకు మాలపల్లి అని పేరు పెట్టడం సాహసమని చెప్పారు. గాంధీ మార్గదర్శకాలతో రామదాసు పాత్రను తీర్చిదిద్ది, సంఘ సంస్కరణకు పునాదులు వేశారన్నారు. మాలపల్లి లక్ష్యాలు ఇంకా పూర్తి కాలేదని, కనీస పౌరుడి అవసరాలు నెరవేరాలంటే ఉన్నవ, అంబేద్కర్, మహాత్ముని స్ఫూర్తితో మరొకసారి సాంఘిక ఉద్యమాలు జరగాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయమ్మ లాంటి మహానుభావులను స్మరించుకునేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ వాళ్ల చేసిన సేవలను, కృషిని తెలియజేస్తూ ముందుకెళ్లాలన్నారు. ఉన్నవ రచించిన మాలపల్లి ప్రభావం నాటి సమాజాన్ని, రచయితలను ప్రభావితం చేసిందన్నారు. కవికి, నదికి మరణం లేదని, ఉన్నవ దంపతులు సజీవంగా మనందరి హృదయాల్లో కొలువున్నారని అన్నారు. అనంతరం శారదానికేతనం కరస్పాండెంట్ టి.శ్రీనివాసరావు ప్రసంగించారు. తొలుత ఉన్నవ దంపతుల చిత్రపటానికి అతిథులు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. మాలపల్లి నవల విశిష్టతను తెలియజేస్తూ స్కిట్ ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త డి.ఎ.ఆర్. సుబ్రహ్మణ్యం, ఉన్నవ కుటుంబ సభ్యులు హేమ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోటిరత్నం, హైస్కూల్ హెచ్ఎం ఎన్.ఉషాకుమారి, డిబిఎఫ్ వ్యవస్థాపకులు కొరివి వినియ్‌కుమార్, చలపతిరావు, నారాయణరెడ్డి, మేకల రామారావు పాల్గొన్నారు.

34 ఏళ్లుగా మా సమస్య

(మొదటి పేజీ తరువాయి)

అందులో 20 శాతాన్ని నష్టపరిహారం ఇవ్వటానికి వెనుకాడుతోందని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలన్నారు. కార్మికులు అర్థాకలితో అలమటిస్తున్నా.. 170 మంది చనిపోయినా మానవత్వం లేనివిధంగా ప్రభుత్వం ప్రవర్తిస్తోందని విమర్శించారు. ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీకి రూ.10 వేల కోట్ల ఆస్తులున్నాయని, కోర్టు తీర్పు మేరకు నష్టపరిహారం కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టియు (న్యూ) నాయకులు కె.కోటేశ్వరరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి వి.దుర్గారావు, ఎఐటియుసి నాయకులు కె.వెంకటయ్య మాట్లాడుతూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న ప్రభుత్వాలు, కార్మికుల సమస్యను మాత్రం పరిష్కరించడం లేదని విమర్శించారు. ఏం పాపం చేశారని సిమెంట్ ఫ్యాక్టరీ సమస్యను పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. నాలుగు ప్రభుత్వాలు మారినా ఫ్యాక్టరీ కార్మికుల సమస్య పరిష్కారం చేయరా? అని నిలదీశారు. ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్ ప్రకటించినప్పటి నుండి జరిగిన పరిణామాలు యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ వివరించారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు బి.వెంకటేశ్వర్లు, ఎస్.దుర్గారావు, నరసింహారావు, ఎం.శారద, ఇమాంబి, కె.ఆదినారాయణ, నవనీతం, అంకయ్య, ప్రకాష్‌రావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

డిడిఒను వర్చువల్‌గా ప్రారంభించిన డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్రంలో ఒకేసారి 77 కొత్త డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డిడిఓ) కార్యాలయాలను గురువారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించారు. నరసరావుపేట మండలం లోని లింగంగుంట్లలో నూతన డిడిఓ కార్యాలయ భవనాన్ని ఆయన వర్చువల్ గా అధికారికంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, ఎంపిడిఓ టివి. కష్ట కుమారి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి పథకాల అమలు మరింత వేగవంతం కావాలని, ప్రజలకు అధికారులు సమీపంలో ఉంటూ సేవలు అందించేలా డిడిఓ కార్యాలయాలు దోహదపడతాయన్నారు.

రేషన్ అక్రమాలపై మొద్దునిద్ర

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తున్నామని తమనెవ్వరూ ఏమిచేయలేరని డీలర్లపై జులుం ప్రదర్శిస్తున్నారు. అంతేగాక తమకు నచ్చని డీలర్ల స్థానంలో కొత్త వారిని ఎంపిక చేసేందుకు ప్రజా ప్రతినిధుల అనుచరులను అధికారుల వద్దకు పంపి వారి ద్వారా తమపై కేసులు నమోదు చేయిస్తున్నారని డీలర్లు వాపోతున్నారు. తాము నిజాయితీగా వ్యాపారం చేద్దామనా మాఫియా, పౌరసరఫరాల శాఖ అధికారులు చేయనివ్వడం లేదని, ఫలానా వారికి బియ్యం ఇవ్వాల్సిందేనని వత్తిడి తెస్తున్నారని పలువురు డీలర్లు తెలిపారు.

వైసిపి హయంలో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారంలో కీలక భూమిక పోషించిన వారు ఇప్పుడూ తమ వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నా టిడిపి ప్రజాప్రతినిధులు ఇప్పటి వరకు పట్టించుకోలేదు. మాఫియా ప్రతినిధులు అనిల్, శ్రీనివాస్ తదితరులు ప్రజాప్రతినిధులను తమకు అనుకూలంగా తిప్పుకోవడంలో సఫలీకృతులయ్యారు. గత ప్రభుత్వంలో రేషన్ సరఫరాలో అక్రమాలు జరిగాయని, పేదలకివాల్సిన బియ్యం పలు రాష్ట్రాలకు అక్రమంగా ఎగుమతి అవుతున్నాయని ఆరోపణలు చేసిన కూటమి పార్టీల నాయకులు గత ఏడాదిన్నరగా అసలు పట్టించుకోవడం లేదు. కొన్ని ప్రాంతాల్లో మాఫియాతో సర్దుబాటు ధోరణిలో వ్యవహరిస్తున్నారు. కార్డుదారులకు గతంలో మాదిరిగానే ప్రజలకు బియ్యంకు బదులు సొమ్ములు ఇస్తున్నారు. డీలర్లు కూడా రేషన్ మాఫియాకు సహకరిస్తున్నా నియంత్రించాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. డీలర్ల వద్ద నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు వున్నాయి. ఇదే సమయంలో మాఫియానుంచి మామూళ్లతో ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపణలున్నాయి.

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని తక్కెళ్ళపాడు గ్రామంలో యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జరిగింది. పోలీసులు కథనం ప్రకారం తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన షేక్ ఆజాద్ (25) ఎలక్ట్రీషన్ వత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.తమ సమీప బంధువుకి తన పేరు మీద బ్యాంకులో లోను ఇప్పించడంతో తను సరైన సమయానికి చెల్లించకపోవడంతో ప్రైవేట్ బ్యాంకు సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి దురుసుగా ప్రవర్తించడంతో మనస్తాపం చెందిన ఆజాద్ బుధవారం రాత్రి తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.గురువారం ఉదయం తన గదిలోనికి వెళ్లగా ఫ్యానుకు వేలాడడం చూసిన తండ్రి షేక్ సుభాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

నాగసరపు రామారావు 13వ సంస్మరణ సభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డు లోని ఎస్.ఎస్.ఎన్ కళాశాల మాజీ సెక్రటరీ -కరస్పాన్డెంట్ నాగసరపు రామారావు 13వ వర్ధంతి సందర్భంగా గురువారం కళాశాల సెక్రటరీ – కరస్పాన్డెంట్, నరసరావుపేట మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా ఆధ్వర్యంలో కళాశాల ఆడిటోరియంలో సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని, నాగసరపు రామారావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఈ కళాశాల పూర్వ విద్యార్థినే అన్నారు.వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో నాడు కళాశాల స్థాపించి ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో ఎందరికో నామ మాత్రపు ఫీజులతో విద్యా దానం చేసిన మహోన్నత వ్యక్తి నాగసరపు రామారావు అని కొనియాడారు. ఇందిరా ప్రియదర్శినీ అవార్డు గ్రహీత అని, వారి విశిష్ట సేవలను గుర్తించి ఆచార్య నాగార్జున యునివర్సిటీ వారు ప్రతిభ పురస్కారాన్ని అందజేసిందన్నారు. 55 ఏళ్ల పాటు సెక్రెటరీ %డ% కరస్పాన్డెంట్ గా బాధ్యతలు నిర్వహించి, అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో రామారావు మనుమలు రూపేష్ గుప్తా, రాందేవ్ గుప్తా, కళాశాల కమిటీ సభ్యులు బొలిశెట్టి రామమోహనరావు, కూనిశెట్టి లక్ష్మయ్య, వక్కలగడ్డ కోటేశ్వరరావు, బత్తుల వెంకట మురళీధరరావు, తాడేపల్లి వెంకట భావన్నారాయణ, ఊటుకూరి రంజిత్ కుమార్, పెనుగొండ ప్రభాకర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి పాల్గొన్నారు.



ధాన్యం తేమ శాతం 17 మించరాదు

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరు మండలం మునిపల్లె, పచ్చలతాడిపర్రు గ్రామాలలో ధాన్యం ఆరబెట్టిన రైతులు కళ్లాలను తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్, మండల వ్యవసాయ అధికారి ఆర్.వెంకటేశ్వరావు గురువారం సందర్శించారు. రైతులు తమ పొలంలో హార్వెస్టర్ చేసిన ధాన్యంను 17 శాతంలోపు ఉండేలా ఎండబెట్టుకోవాలని తహసిల్దార్ సూచించారు. గత ఐదు రోజులు విభిన్న వాతావరణ పరిస్థితులు వలన అధిక తేమ వల్ల ధాన్యపు కొనుగోలు మంద గుండిగా జరుగుతున్నాయని, ఇప్పుడు వాతావరణం అనుపోలించటం వలన ధాన్యాన్ని ఆరబెట్టాలని చెప్పారు. ప్రస్తుతం మండలము నందు 6 కస్టర్లు కొనుగోలు కేంద్రము ద్వారా ధాన్యము కొనుగోలు చేస్తున్నారని, రైతులు తొందరపడి దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవద్దని వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు చెప్పారు. గుంటూరు జిల్లా సివిల్ సప్లైయిస్ జిల్లా మేనేజర్ తులసి పచ్చల తాడిపర్రు గ్రామంలో పర్యటించారు. గోతాలు సమస్య లేదని, మండలంలోని మిల్లుల ద్వారా ధాన్యము కొనుగోలుకు సమస్య లేదని రైతులకు చెప్పారు. కార్యక్రమములో విపిఏలు పి.మాణిక్యరావు, వి.వాసవి పాల్గొన్నారు.

ఆలయ ఆస్తులు స్వాధీనంలో ఉద్రిక్తత

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక నందుల పేటలోని వినాయక ఆలయానికి సంబంధించిన ఆస్తుల స్వాధీనంలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నందులపేట వినాయక ఆలయానికి గతంలో దాతలు కొంత స్థలాన్ని, ఇంటిని ఆలయ అవసరాలకు దానం చేశారు. అయితే దాతలు ఇచ్చిన ఇంటిలో ఇతరులు దీర్ఘకాలికంగా నివసిస్తున్న నేపథ్యంలో దేవాదాయ శాఖ కోర్టు ద్వారా దానిని స్వాధీనం చేసుకునేందుకు ఉత్తర్వులు పొందింది. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ అధికారులు, పోలీసులు ఒక్కసారిగా ఇంటి వద్దకు వెళ్లడంతో అక్కడ స్థానికులు పెద్ద ఎత్తున ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఇంట్లోని వారు గేటుకు తాళం వేసి ఎవరిని లోనికి అనుమతించ లేదు. దీంతో టూ టౌన్ సిఐ రాముల నాయక్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంట్లో నివసిస్తున్న వారితో మాట్లాడారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఇంటిని కాళీ చేయాలని, అది ఆలయానికి సంబంధించిన ఆస్తి అని వివరించారు. అయితే పితరులు తమ ఆస్తిగా చెప్పారని దాని కారణంగానే ఇప్పటివరకు నివసించామని, ఆలయ ఆస్తిగా ఎప్పుడు ఎవరు తమను హెచ్చరించింది లేదని స్పష్టం చేశారు. ఇప్పటికిప్పుడు ఖాళీ చేయాలంటే రోడ్డుమీద పడినట్లేనని, పది రోజుల సమయం ఇస్తే ఖాళీ చేస్తామని లిఖితపూర్వకంగా వారు పోలీసులకు తెలియజేశారు. దీంతో ఆందోళన సద్దుమణిగింది. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్లు ఎం.వెంకటేశ్వర్లు, సిహెచ్ శ్రీనివాసులు, ఈవోలు మల్లేశ్వరి, హరిప్రసాద్, వెంకటేశ్వర్లు, సుందర్ బాబు, శ్రీనివాసరెడ్డి, గోపాలకృష్ణ, జంగం సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగలింగం, టూ టౌన్ పోలీసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ రాముల నాయక్

గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం



తిక్కిరెడ్డిపాలెంలో సి.సి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న కార్యదర్శి జి.మాధవి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వం తోనే సాధ్యం అని ప్రత్తిపాడు తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షులు గింజుపల్లి శివరాంప్రసాద్ అన్నారు. గురువారం మండల పరిధిలోని నిమ్మగడ్డవారిపాలెం, తిక్కిరెడ్డిపాలెం గ్రామాలలో సిసి రోడ్ల శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు గింజుపల్లి శివరాంప్రసాద్ మాట్లాడుతూ అభివృద్ధి కోసం సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కష్టపడుతున్నారని, నియోజక వర్గంలో ఎమ్మెల్యే రామాంజనేయులు చొరవతో నిధులు సమకూర్చి పలు అభివృద్ధి పనులు త్వరిత గతిన చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.మాధవి, సర్పంచులు మాకినేని జగన్ మోహన్ రావు, జి.పద్మావతి సతీష్,రాష్ట్ర గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కాసు పెంట రెడ్డి,పాత మల్లయ పాలెం సొసైటీ ప్రసిడెంట్ కుర్రి సుబ్బారెడ్డి, మర్రి వెంకటశివ, వెలివెళ్ళి సుబ్బారావు, భాగ్యరావు, ఇన్నగంటి సుధాకర్, రాము, సతీష్, అమర్, శేషు రెడ్డి, అంజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంతకం ఫోర్జరీ కేసులో షేక్ జలీల్ ఖాన్ అరెస్టు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఫోర్జరీ సంతకాలతో డాక్యుమెంట్ సృష్టించి మోసం చేయాలని చూసిన పెదవడ్లపూడి గ్రామానికి చెందిన షేక్ జలీల్ ఖాన్‌ను స్థానిక పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. షేక్ జలీల్ ఖాన్ చిన్నకాకాని గ్రామ పరిధిలో 10.27 ఎకరాల భూమికి సంబంధించి రైతులు తనకు స్వాధీన భయానా అగ్రిమెంట్ కింద అమ్మినట్లు దొంగ డాక్యుమెంట్లు సృష్టించాడు. భూమిని స్వాధీనపరుచుకునేందకు రైతులకు తెలియకుండా పొలం వద్దకు జేసీబీల సహాయంతో వెళ్లడంతో రైతులు అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ అనంతరం జలీల్ ఖాన్ తప్పుడు పత్రాలు సృష్టించి చీటింగ్, ఫోర్జరీ వంటి నేరాలకు పాల్పడ్డారని తెలిపారు. అతన్ని అరెస్టు చేసి మంగళగిరి కోర్టులో హాజరపరచగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.



పోలీసుల అదుపులో జలీల్‌ఖాన్



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ ప్రసాద్

సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపొద్దు : ఎస్ఐ ప్రసాద్

ప్రజాశక్తి - కొల్లిపర

సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపిన కఠిన చర్యలు తప్పవని కొల్లిపర ఎస్ఐ ఎన్.సి.ప్రసాద్ అన్నారు గురువారం కరకట్టపై వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, వాహన పత్రాలు తనిఖీ చేశారు. సంబంధిత పత్రాలు అన్ని వాహనంలోనే ఉంచాలన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని, అలా ఇచ్చినా చర్యలు తప్పవన్నారు. సరైన పత్రాలు లేని వాహన దారులకు జరిమానా విధించారు.

జెడ్‌పి పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తెనాలి

రూరల్ పరిధిలోని అంగలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ టు విద్యార్థులు క్రీడలలో రాష్ట్రస్థాయిలో సత్తా చాటారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.అనురాధ గురువారం వెల్లడించిన వివరాల ప్రకారం పవర్ లిఫ్టింగ్‌లో రాష్ట్రస్థాయిలో మూడు ప్రథమ, ఒక ద్వితీయ, తఅతీయ స్థానాన్ని సాధించారని చెప్పారు. జిల్లాస్థాయిలో అథ్లెటిక్స్లో ప్రతిభ కనబరిచిన 11 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక అయ్యారని, కబడ్డీలో నలుగురు, పుట్బాల్లో ఇద్దరూ, హ్యాండ్ బాల్ ఒకరు రాష్ట్రస్థాయికి ఎంపిక అయ్యారని తెలిపారు. క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు వేమూరి శరత్ బాబు, పులివర్తి రవిరాజు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

బాలుని చికిత్సకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాడికొండ

ఆనారోగ్యంతో బాధపడుతున్న పొన్నెకల్లు గ్రామానికి చెందిన మోక్షయాన్ కార్తికేయ అర్జున్ రెడ్డి తల్లిదండ్రులకు సిఎం సహాయనిధి నుండి 9.5లక్షల చెక్కును స్థానిక ఎమ్మెల్ శ్రావణ్‌కుమార్ గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నేడు వీఆర్ఏల ధర్నా

ప్రజాశక్తి - పెదకూరపాడు

తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తం పిలుపులో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా చేస్తామని వీఆర్ఏల సంఘం (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్ చెప్పారు. ఈ మేరరకు విఆర్ఎలతో కలిసి తహశీల్ధార్ ధనలక్ష్మికి గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బందగీ సాహెబ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17 నెలలు గడుస్తున్న వీఆర్ఏల సమస్య ఏ ఒక్కటీ పరిష్కారం చేయలేదన్నారు. తెలంగాణలో విఆర్ఎలకు పేస్కేల్ అమలు చేస్తుండగా ఇక్కడ మాత్రం 8 ఏళ్లుగా జీతాలు పెరగలేదని, అక్రమ డ్యూటీలు చేయిస్తున్నారని, పమోషన్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. ఏళ్ల తరబడి నామినీలుగా కనిపిస్తున్న వారిని వీఆర్ఏలుగా గుర్తించడం లేదన్నారు. అటెండర్, నైట్ వాచ్మెన్ ప్రమోషన్ శాతాన్ని 70 శాతానికి పెంచాలన్నారు. ఈ సమస్యలపై చేపట్టే ధర్నాలో విఆర్ఎలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, సీతారామరాజు, షేక్ ఖాసీం, షేక్ జాను, ప్రకాష్, శ్రీమోను, రోశయ్య పాల్గొన్నారు.



రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీటిని తొలగించండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణం ప్రకాష్ నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద దీర్ఘకాలంగా కుంటల్లో నిలిచిన నీరు, దోమల కేంద్రంగా మారి, దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో అటుగా వెళుతున్న పాదచారులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తోంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. మున్సిపల్, రైల్వే అధికారులకు ఫోన్ చేసి తక్షణమే శుభ్రం చేయాలని ఆదేశించారు.



13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ఈనెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మధుస్వామి ఆధ్వర్యంలో గురువారం నరసరావుపేట జిల్లా కోర్ట్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. జడ్జి మధుస్వామి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు, ఇతర వివాదాలు పరిష్కరిస్తామని చెప్పారు. వివాదాలు వేగవంతంగా, పరిష్కారం కావడానికి లోక్ అదాలత్ గొప్ప అవకాశమని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్జిలు ఆర్.ఆశీర్వాదంపాల్, ఎ.సలోమి, ఎం.గాయత్రి, పోలీసులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



శారద జెడ్‌పి పాఠశాలకు నేడు పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని శ్రీ శారద జెడ్‌పి పాఠశాలలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించే మెగా పేరెంట్స్ మీటింగ్‌కు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరవుతారని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల తెలిపారు. ఈ మేరకు పాఠశాలను కలెక్టర్ గురువారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. మీటింగ్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మాత్రమే పాల్గొనాలని, ఇతరులు దూరంగా ఉండాలని చెప్పారు. పరిశీలనలో పల్నాడు ఎస్పీ కృష్ణారావు, డీఆర్వో మురళి, డీఈవో చంద్రకళ, ఆర్డీవో మధులత ఇతర అధికారులు పాల్గొన్నారు.

భూసేకరణ అయితే మీకు నష్టం.. పూలింగ్‌కు ఇవ్వండి

నాలుగు గ్రామాల రైతులతో ఎండ్రాయిలో మంత్రి నారాయణ సమావేశం

ప్రజాశక్తి - అమరావతి

మండలంలోని నాలుగు గ్రామాల్లో భూమిని రాజధానికి భూసమీకరణలో తీసుకోనున్న నేపథ్యంలో ఆయా గ్రామాల రైతులతో ఎండ్రాయి గ్రామంలో గురువారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం కోసం రైతులు సహకరించాలని, ల్యాండ్ పూలింగ్‌కు భూములివ్వాలని కోరారు. రాజధానిలో రైతుల భూముల ధరలు పెరగాలంటే స్మార్ట్ ఇండస్ట్రీలు, ఎయిర్ పోర్ట్ రావాలని, దీని ద్వారా ఉద్యోగాలు వచ్చి ఆర్థికాభివృద్ధి సాధించగలమని అన్నారు. స్పోర్ట్స్ సిటీ నిర్మాణ పనులు ఏడాదిలోగా ప్రారంభించాలని సీఎం చెప్పారని, ఒలింపిక్ క్రీడలు నిర్వహించే స్థాయిలో 2500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ నిర్మిస్తామని అన్నారు. ఈ భూములను భూ సేకరణ ద్వారా తీసుకుంటే రైతులు నష్టపోతారని, అందుకే ల్యాండ్ పూలింగ్ ద్వారా తీసుకుంటున్నామని చెప్పారు. రైతులకు ఇచ్చే ప్లాట్‌లలో ముందుగా రోడ్లు వేస్తామని, రైతులకు క్యాపిటల్ గెయిన్స్ నుంచి మినహాయింపు ఇచ్చే ప్రతిపాదనపై కేంద్రం పరిశీలిస్తోందని అన్నారు. ఇదిలా ఉండగా ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్‌కు నాలుగెకరాలకు సంబంధించిన ధ్రువపత్రాలను ఇచ్చిన రైతు నంబూరి బలరాంను మంత్రి, ఎమ్మెల్యే అభినందించారు. ల్యాండ్ పూలింగ్‌లో ఏ సమస్య ఉన్నా తన వద్దకు రావాలని మంత్రి చెప్పారు.



మాట్లాడుతున్న మంత్రి నారాయణ, వేదికపై ఎమ్మెల్యే ప్రవీణ్

లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ ఎఇ

విద్యుత్ కనెక్షన్ కేటగిరీ మార్పునకు రూ.25 వేలు డిమాండ్

ప్రజాశక్తి - కారంపూడి



విద్యుత్ కనెక్షన్ కేటగిరీ మార్పు అంశంలో లంచం తీసుకుంటుండగా ఆ శాఖ ఎఇని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మండల కేంద్రమైన కారంపూడికి చెందిన వలి ఇంజనీరింగ్ వర్క్స్ షాపునకు కేటగిరీ 3 మీటర్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు మూడు నెలల నుండి తిప్పుకుంటూనే మీటర్ ఇవ్వకపోవడంతోపాటు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు మస్తాన్‌వలి ఏసీబీని ఆశ్రయించారు. ఈ క్రమంలో గురువారం ఏసీబీ అడిషనల్ ఎస్పీ మహీందర్ ఆధ్వర్యంలో అధికారుల బృందం గురువారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కారంపూడి విద్యుత్ శాఖ కార్యాలయంలో తనిఖీలు చేపట్టింది. రూ.25 వేలు లంచం తీసుకుంటున్న విద్యుత్ శాఖ ఎఇ కె.పెదమస్తాన్‌ను రెడ్‌హ్యాండెడ్ పట్టుకున్నట్లు మహీందర్ తెలిపారు. పెద్దమస్తాన్ గతంలో రాజుపాలెం, మాచవరం మండలాల్లోనూ పనిచేశారని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలలో ఎవరైనా లంచం అడిగితే బాధితులు 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. దాడిలో ఏసీబీ సిఐలు నాగరాజు, మన్మథరావు, ఎస్ఐలు సతీష్‌బాబు, సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చెప్పి నెలరోజులైనా...!

ఇసుక లారీ సమస్యపై అధికారులకు సిపిఎం మరోసారి వినతులు

ప్రజాశక్తి - అమరావతి

భారీ ఇసుక లారీలు అమరావతిలో గుండా రాకపోకలు సాగించడం ప్రమాదకరమని, వీటిని గ్రామం వెలుపల నుండి రింగురోడ్డు బైపాస్ వైపు మళ్లించాలని సిపిఎం సిపిఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు కోరారు. ఈ అంశంపై గతంలో ఎమ్మెల్యే ప్రజాదర్బార్‌లో విన్నవించగా 30 రోజుల్లో పరిష్కరిస్తామంటూ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ బదులిచ్చారని, ఇప్పటికీ సమస్య కొనసాగుతూనే ఉందని పేర్కొన్నారు. త్యం సందర్శకులు అమరావతికి వస్తుంటారని, ఉదయం 8 గంటల నుండి విద్యాసంస్థలకు ఈ మార్గంలోనే విద్యార్థులు వెళ్తుంటారని, పశువులు, వివిధ రకాల జీవాలు కూడా మేతకు వెళ్తుంటాయని, ఈ నేపథ్యంలో భారీ వాహనాలు రాకపోకల వల్ల ప్రమాదాల భయంతోపాటు కాలుష్య ప్రమాదమూ ఉందని తెలిపారు. ఈ సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని పలువురు అధికారులకు వాట్సప్ ద్వారా గురువారం మరోసారి పంపించారు.

594 కిలోల గంజాయి ధ్వంసం

ప్రజాశక్తి - యడ్లపాడు

పశ్చిమగోదావరి జిల్లా జిల్లా వ్యాప్తంగా 21 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 594.844 కిలోల గంజాయిని అక్కడి పోలీసులు యడ్లపాడు మండలం కొండవీడు గ్రామ పరిధిలో గల జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ప్లాంట్ వద్ద గురువారం ధ్వంసం చేశారు. కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, ఇతర పోలీస్, అధజకారులు పర్యవేక్షించారు.



ధాన్యం అమ్ముకున్న 24 గంటల్లో రైతులకు నగదు జమ

అంగలూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని అంగలూరు గ్రామంలో రైతుసేవా కేంద్రం వద్ద ఈపూరు పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటలలో రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేస్తోందని చెప్పారు. రైతులు మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలనే సాగు చేయాలని, ఉద్యాన పంటలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిసోందని, వాటి సాగుకు రైతులు మొగ్గు చూపాలని సూచించారు. సన్నకారు రైతు ధ్రువ పత్రం ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ పలుమార్లు తిప్పుతున్నారని తహశీల్ధార్‌పై గ్రామస్తుడు మునుగోటి శ్రీనివాసరావు ఫిర్యాదు చేయడంతో తహశీల్ధార్‌కు జీవీ ఆంజనేయులు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అవసరమైన ధవపత్రాలు వెంటనే మంజూరు చేయాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా వైసిపి అధినేత జగన్, వైసిపి ప్రభుత్వంపై జీవీ ఆంజనేయులు విమర్శలు చేశారు. గత వైసిపి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు నెలలు గడిచినా ఇవ్వలేదని, ఆ బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. మొంథా తుపానుతో ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతుంటే వారిని తమ ప్రభుత్వం ఆదుకుందని చెప్పారు. రైతులకు రాయితీతో అందించే డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని జగన్ నిలిపివేశారని, విశాఖ స్టీల్ ప్లాంట్ భూములను కబ్జా చేసేందుకు యత్నించారని విమర్శించారు. ధరల స్థిరీకరణ నిధికి రూ.3 వేల కోట్లు కేటాయిస్తానని చెప్పి రూ.3 కూడా ఇవ్వని రైతు ద్రోహి జగన్ అన్నారు. నాడు రైతులు ఆత్మహత్యల పాపం జగన్‌దేనని అన్నారు. వైసిపి హయాంలో రూ.వేల కోట్ల మద్యం స్కాం జరిగిందని, ఒక్క ప్రాజెక్టును కూడా ముందుకు నడపకుండా రూ.10 లక్షల కోట్లు అప్పులు చేసి దోచుకున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఎడిఎ రవికుమార్, హౌసింగ్ డిఈఈ సాంబయ్య, ఏపీ ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ పి.నాగేశ్వరరావు, ఏవో ఆర్.రామారావు, సీఈవో పి.కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ బి.వెంకట కోటయ్య, నాయకులు నర్రా కిషోర్, ఐ.కోటేశ్వరరావు, గోపు వీరాంజనేయులు, గోవింద నాయక్, కె.అంకారావు పాల్గొన్నారు.



నిర్వాసితులకు న్యాయమైన పునరావాసం కల్పించాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

ప్రజాశక్తి- తాడేపల్లి

సీడ్ యాక్సెస్ రోడ్డులో భాగంగా కేలరావు కాలనీ సమీపంలో నిర్మిస్తున్న లింకు బ్రిడ్జి నిర్వాసితులకు న్యాయమైన పునరావాసం కల్పించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ డిమాండ్ చేశారు. గురువారం రాత్రి తాడేపల్లి మేక అమరారెడ్డి భవన్ లో జరిగిన సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు, శాఖకార్యదర్శుల విస్తృత సమావేశం దొంతి రెడ్డి శ్రీనివాస్ కుమారి అధ్యతన నిర్వహించారు. సమావేశంలో నేతాజీ మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అభివృద్ధికి ముఖ్యమైన ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని సిపిఎంతో సహ అందరూ ఆమోదిస్తారని చెప్పారు. ఏ అభివృద్ధి ప్రాజెక్టు చేపట్టిన దానివల్ల నిర్వాసితులవుతున్న ప్రజానీకానికి మెరుగైన ప్యాకేజీ తో పునరావాసం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు. అందుకే ఖర్చు కూడా ప్రాజెక్టు ఖర్చులో భాగంగానే ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణం వల్ల 200 పైగా కుటుంబాలు తమ ఇళ్లు కోల్పోయే అవకాశం ఉందని నిర్ధారించారు. రోజువారి పని చేసుకునే పేద కుటుంబాలయిన వీరికి ప్రభుత్వం రెండు సెంట్లు ఇంటి స్థలం తో పాటు, ఇంటి నిర్మాణానికి రూ 5 లక్షలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా మంత్రి నారా లోకేష్ ఇచ్చిన వాగ్దానానికి భిన్నంగా సెంటు స్థలమే ఇస్తామని చెప్పడం అన్యాయమన్నారు. ఇందుకు అంగీకరించకపోతే బలవంతంగా ఖాళీ చేస్తామని చెప్పటం, అధికారులు బెదిరింపులకు దిగటం అన్యాయమన్నారు. పెద్దపెద్ద పెట్టుబడిదారులకు వేల ఎకరాలు కట్టబెట్టడానికి ప్రభుత్వం బలవంత భూసేకరణకు పాల్పడుతున్నారన్నారు. రాజధాని నిర్మాణంలో భాగంగా సర్వం కోల్పోతున్న తాడేపల్లి కెఎల్ రావు కాలనీ పేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణం పూర్తిచేసే లోగా, ఇళ్లల్లో ఉండేందుకు కనీసం 6 నెలల పాటు ఇంటి అద్దె చెల్లించాలని సిపిఎం డిమాండ్ చేస్తుందని చెప్పారు. నిర్వాసితులంతా తమకు న్యాయంగా రావాల్సిన ప్రతిఫలం పొందేందుకు ప్రయత్నం చేయాలని, ప్రజాతంత్ర వాదులంతా నిర్వాసితులకు అండగా నిలవాలని సిపిఎం పిలుపునిస్తుందని చెప్పారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేతాజీ

సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పెదనందిపాడు : కొత్తగా అమలులోనికి వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి గతంలోని 28 లేబర్ చట్టాలు పునరుద్ధరించాలని సి.పి.ఎం. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పెదనందిపాడు లోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో పార్టీ సీనియర్ నాయకులు జంపని రామారావు అధ్యక్షతన జరిగిన సి.పి.ఎం. పెదనందిపాడు మండల కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. నాలుగు లేబర్ కోడ్లు అమలులోకి వచ్చిన రీత్యా యూనియన్ పెట్టుకునే హక్కుని కార్మికులు కోల్పోతారని, కార్మికులకు ఉన్న హక్కులు హరించివేయబడతాయని ఆయన అన్నారు. పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాలను, మన రాష్ట్రంలో తిరిగి 12 గంటలు పని చేయాలని చట్టం చేయడం చాలా దుర్మార్గమని తెలిపారు . కార్మికులకు కనీస వేతనాలు అమలు కావటం లేదని, నిత్యవసర వస్తువులు ధరలు ఆకాశాన్ని అంటి కొనలేని పరిస్థితులకు చేరి ,పేదవానికి అందని ద్రాక్ష పండ్లలా ఉన్నాయని అన్నారు.ఈ నేపధ్యంలో విశాఖపట్నంలో డిసెంబరు 30 నుండి జనవరి 3 వరకు జరిగే సి.ఐ.టి.యు.జాతీయ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. నెల్లూరుకు చెందిన సి.పి.ఎం నాయకులు పెంచలయ్యను గంజాయి ముఠా అతి క్రూరంగా హత్య చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గంజాయి తయారుచేయడం, అమ్మడం నేరమని పెంచలయ్య తన కళారూపాల ద్వారా తెలియజేశారని, సమాజాన్ని ,ప్రజలను మేలుకొల్పాలని చూసిన పెంచలయ్యను నెల్లూరులోని గంజాయి ముఠా హత్య చేశినా, రాష్ట్ర ముఖ్యమంత్రి గాని, రాష్ట్ర మంత్రులు గాని ఇప్పటివరకు నోరు మెదపకపోవడాన్ని ఆయన తప్పు పట్టారు .ఇప్పటికైనా పెంచలయ్య భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ,కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని, పెంచలయ్య కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉండి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ గుంటూరు ఛానల్ పొడిగింపుపనకు వెంటనే నిధులు విడుదల చేసి ,భూసేకరణ చేపట్టి , పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు . నల్లమడ వాగు పై నివసిస్తున్న నిర్వాసితులకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇల్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. నల్లమడ ఆధునీకరణకు నిధులు విడుదల చేయాలని కోరారు. సమావేశంలో ముద్దన వెంకటేశ్వర్లు,ఫణిదపు భువనేశ్వరి ,అన్నలదాసు ఆశీర్వాదం ,మద్రి లక్ష్మి ,షేక్ షమ్మి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న పాశం రామారావు

ఆగస్టులో అని హామీ ఇచ్చారు.. డిసెంబర్ వచ్చింది..?

పేదలకు ఇచ్చిన హామీలను మంత్రి లోకేష్ వెంటనే నెరవేర్చాలి : సిపిఎం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, ఆ మేరకు రైతులకు భరోసా కల్పించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు డిమాండ్ సిపిఎం మంగళగిరి మండల విస్తృత సమావేశం కాజా గ్రామంలో మండల నాయకురాలు సింహాద్రి సుమ అధ్యక్షతన జరిగినది. సమావేశంలో ఈమని అప్పారావు మాట్లాడుతూ వరి ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయడం లేదని, వాతావరణ పరిస్థితులు ఆసరా చేసుకొని ప్రైవేట్ మిల్లర్లు రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు. కళ్లాల్లో ధాన్యాన్ని అమ్ముకుంటున్నారని వీరికి మద్దతు ధర ఇవ్వటం లేదని తెలిపారు. రైతు వద్ద తేమశాతం ఒకరకంగాను మిల్లుకు వెళ్లిన తర్వాత మరో రకంగానూ చూపుతోందని ఈ రకంగా రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు . అలాగే రైతులకు గోనె సంచులు గాని , టార్పాలిన్ పట్టాలు గాని అందుబాటులో లేవని ధాన్యాన్ని రోడ్డు మీద ఆరబోసుకొనె పరిస్థితి ఉందని, వర్షం వస్తే పంట మొత్తం నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు గోనెసంచులను, టార్పాలిన్ పట్టాలను, తేమశాతం చూపించే పరికరాలను అందుబాటులో ఉంచాలని కోరారు. అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి కార్మికులకు తీవ్రమైన అన్యాయం చేశారని వెంటనే లేబర్ కోడ్ లను వెనక్కి తీసుకోవాలని కోరారు. మంగళగిరి నియోజకవర్గంలో ఇల్లు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని అలాగే ప్రభుత్వ భూములలోను, చెరువు పోరంబోకు భూములలోను, ఫారెస్ట్ భూములలోను నివాసముంటున్న వారందరికీ పట్టాల మంజూరు చేస్తామని ఎన్నికలకు ముందు లోకేష్ గారి హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే ఎత్తటం లేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని అలాగే వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారికి ఇళ్ళ పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ప్రజలను సమీకరించి ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిపిఎం పార్టీ మంగళగిరి మండల కార్యదర్శి వుద్దంటి దుర్గారావు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తాడేపల్లి మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి రెండు నెలలు కావస్తుందని అధికారులు వెంటనే పేదలందరిని గుర్తిస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు గ్రామాలలో పేదలను గుర్తించేందుకు సర్వే కూడా చేపట్టలేదని ప్రజలను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు నాటికి వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారని ఇప్పుడు డిసెంబరు వచ్చిందని ఇంతవరకు ఆ హామీని నెరవేర్చలేదని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వం గనుక ఇల్లు లేని పేదలకు ఇళ్ల స్థలము అలాగే ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు గనక ఇవ్వకపోతే మిలిటెంట్ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. మంగళగిరి కార్పొరేషన్ లో విలీనమైన గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని అంతర్గత రోడ్లు లేవని ఈ సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని ఆయన కోరారు కార్యక్రమంలో సిపిఎం పార్టీ మంగళగిరి మండల నాయకులు బి .కోటేశ్వరి, జి .అజయ్ కుమార్, కాజ శివశంకరరావు, తమ్మ ప్రసాద్ రెడ్డి, దోసపాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈమని అప్పారావు

గంజాయి నుండి యువతను రక్షించాలి

ప్రజాశక్తి-గుంటూరు

గంజాయి మాఫియా ఆగడాలను అరికట్టాలని, పెంచలయ్యను చంపిన నిందితులను కఠినంగా శిక్షించాలని సిపిఎం పాత గుంటూరు శాఖ ఆధ్వర్యంలో శుద్ధపల్లి డొంకలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు అరుణ మాట్లాడు తూ గంజాయి అమ్మకాలు రాష్ట్రంలో విచ్చలవిడిగా జరుగు తున్నాయని వీటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైం దని, మద్యం, మత్తు పదార్థాలు గంజాయి డ్రగ్స్ లాంటివి విక్రయించే వారికి మద్దతుగా నిలుస్తున్నారని అన్నారు. నెల్లూరు జిల్లాలో పెంచలయ్యను కన్న బిడ్డల ఎదుటే అతి కిరాతకంగా చంపారని, గంజాయా మాఫియా వారి వ్యాపారం కోసం ఎంతటికైనా తెగించేస్థాయికి చేరిందనటానికి ఈ ఘటన నిదర్శనం అన్నారు. పెంచలయ్యను చంపిన నిందితులను కఠినంగా శిక్షించాలని, కుటుంబాన్ని ఆదుకోవాలని నష్టపరిహారం చెల్లించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. యూనివర్సిటీలు, కాలేజీలు, స్కూల్ విద్యార్థులు కూడా గంజాయి బారిన పడుతున్నారని, నేరస్తులుగా తయారవుతున్నారన్నారు. భావి తరాలను మత్తులో ముంచే గంజాయి, ఇతర మత్తు పదార్థాల నుండి వారిని రక్షించాలన్నారు. ఇప్పటికే మద్యం మత్తులో అనేక హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని గంజాయి, డ్రగ్స్ లాంటి వినియోగం వల్ల యువత జీవితం నాశనం అవుతుందన్నారు. మద్యం, మత్తుపదార్థాలు గంజాయిని అరికట్టాలని ప్రజల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో పాత గుంటూరు సిపిఎం నాయకులు టి శ్రీనివాస్, ఎస్.కె. సైదా, నటరాజ్, ఎస్.కె. మునీర్, ఎస్.కె.రియాజ్, బాబు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బదిలీ కార్మికులు

బదిలీ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలి

ప్రజాశక్తి - మంగళగిరి

ఎం బుక్, బదిలీ కార్మికులను వెంటనే ఆప్కాస్ లో చేర్చాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం రాత్రి మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఎం బుక్, బదిలీ కార్మికులను వెంటనే ఆప్కాసులో చేర్చాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిటీ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ధర్నాలో ఉమామహేశ్వర మాట్లాడుతూ బదిలీ కార్మికులకు ఎఫ్ఆర్ఎస్ కల్పించి పనిలోకి తీసుకోవాలని, వారానికి ఒకరోజు సెలవు ఇవ్వాలని అన్నారు. అదేవిధంగా సమ్మె కాలపు ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు జరపాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్పొరేషన్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఎస్యూ చెంగయ్య, యూనియన్ నాయకులు బి ముత్యాలరావు, పుణ్యవతి పాల్గొన్నారు.

సొసైటీ స్కామ్ నిందితుడికి 14 రోజులు రిమాండ్

జిల్లా జైలుకు తరలింపు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి, కురగల్లు సొసైటీలో రూ.10 కోట్లు కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు సొసైటీ సిఈవో రాయల రమేష్ బాబు మంగళగిరి కోర్టులో గురువారం లొంగిపోయారు. మంగళగిరి, కురగల్లు పిఏసిఎస్ లో 10 కోట్ల రూపాయలు రైతులు చేత డిపాజిట్లు చేయించడం జరిగింది. అయితే ఈ డిపాజిట్లు బ్యాంకుతో సంబంధం లేకుండా నకిలీ బాండ్లు రైతులు అందజేయడం జరిగింది. రమేష్ బాబును అక్టోబర్ 10వ తేదీన సస్పెండ్ చేయటం జరిగింది. సస్పెండ్ చేసిన తర్వాత మంగళగిరి,కురగల్లు పిఏసిఎస్ అధ్యక్షులు గా ఉన్నవారు మంగళగిరి పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లో రమేష్ పై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడు రమేష్ బాబు మంగళగిరి కోర్టులో లొంగిపోయారు. కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. గుంటూరు సబ్ జైలుకు రమేష్ బాబును పోలీసులు తరలించారు.

31 అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్‌ల పోస్టుల దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రభుత్వ మండల పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్‌ల నియామకానికిగానూ ప్రభుత్వం ఉత్తర్వులు మంజూరు చేసినట్టు మండల విద్యాశాఖాధికారి ఎన్.బాబు గురువారం తెలిపారు. మంగళగిరి మండలంలో ఎస్.జీ.టి.-1, స్కూల్ అసిస్టెంట్... తెలుగు -7, హిందీ- 5, ఇంగ్లిష్ -5, మ్యాథ్స్ -4, పీఎస్ -2, బి.ఎస్. -3, సోషల్ -4 అకడమిక్ ఇన్ స్ట్రక్టర్ పోస్టుల భర్తీకిగానూ అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను మంగళగిరిలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో డిసెంబరు 5వ తేదీలోపు సమర్పించాలని ఎంఈవో పేర్కొన్నారు. మంగళగిరి మండలంలో మొత్తం 31 అకడమిక్ ఇన్ స్ట్రక్టర్‌ల పోస్టులు ఉన్నట్లు వెల్లడించారు. ఎంపికయిన వారికి ఎస్.జి.టి. పోస్టుకు నెలకు రూ.10వేలు, స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పోస్టుకు రూ.12,500 గౌరవ వేతనం ఉంటుందని తెలిపారు. ఈ పోస్టులకు ప్రధానంగా స్థానికులకు ప్రాధాన్యం వుంటుందని ఎంఈవో ఎన్.బాబు పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం మంగళగిరిలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మూతపడిన గేటు.. ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - నాదెండ్ల

గుంటూరు - గుంతకల్ రైల్వే లైనులోని సాతులూరు 291 రైల్వే గేటు గత రెండు రోజులుగా ముగియడంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనాలు,విద్యార్థులు, ద్విచక్ర వాహనాలు లారీలు, బస్సులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిరిగి రావాలంటే సుమారు ఒకవైపు 15 కిలోమీటర్లు మరొకవైపు 25 కిలోమీటర్లు వరకు ఉంటుందని తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్నారు. రెండు రోజులుగా గేటు మూసి వేయడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి తెలియక గందరగోళ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. గేటు దాటి తిరిగి రావాలంటే కొందరికి తెలియక తికమగపడుతున్నారు. అధికారులు వెంటనే రాత్రి సమయాల్లో ఆ పనులు ముగించుకుంటే ఉదయం పూట ఇలాంటి ఇబ్బంది ఉండదు కదా అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. మిషనరీతో చేసే పనులు వెంటనే చేయాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.



పట్టాలు దాటుతున్న విద్యార్థులు



ఘంటసాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు, గాయకులు

ఘనంగా ఘంటసాల 103వ జయంతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రముఖ గాయకులు, సంగీత దర్శకులు దివంగత ఘంటసాల వెంకటేశ్వరరావు 103 వ జయంతి సందర్భంగా గురువారం నరసరావుపేట పట్టణ కళాకారులు, గాయకుల ఆధ్వర్యంలో స్థానిక ప్రకాష్ నగర్‌లోని భువనచంద్ర టౌన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నరసరావుపేట కళావేదిక నిర్వాహకులు పొన్నపాటి ఈశ్వర్ రెడ్డి, బీవీ. చంద్రశేఖర రావు, ఓగూరి నాగేశ్వరరావు, స్వర్ణ చిన్న రామిరెడ్డి, అమరేంద్ర, ఎన్జీవో సత్యనారాయణ, విశ్రాంత ఏఎస్ఐ షేక్ సలామ్, టౌన్ హాల్ అధ్యక్షులు జవ్వాజి వెంకట్రావు, గుబ్బ సురేష్, రత్నాకరం రాము, చేగు వెంకటేశ్వరరావు, బత్తుల మురళి, రంగస్థల దర్శకులు ఎస్ఎం. భాష తదితర గాయకులు, రంగస్థల నటులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత..!

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక నెహ్రూనగర్ టిడిపి కార్యాలయంలో సీఎం చెక్కులను మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి లబ్ధిదారులకు గురువారం అందజేశారు. 46 మంది లబ్ధిదారులకు రూ. 38 లక్షల, 70 వేలు విలువ చేసే నగదు చెక్కులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - మాచర్ల

నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పినప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం స్థానిక నెహ్రూనగర్ టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యల పై దాదాపు 30 అర్జీలను ప్రజలు అందజేయగా, వాటిని పరిశీలించి, సంబంధిత అధికారులను పరిష్కరించాల్సిందిగా జూలకంటి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఈ విజయ్‌కుమార్

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి - ఈపూరు

విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించటమే లక్ష్యంగా ఆ మేరకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు పల్నాడు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ పి.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొచ్చర్ల విద్యుత్ ఉప కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. నిరంతర విద్యుత్ సరఫరాకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. వ్యవసాయ అవసరాల కోసం విద్యుత్ కనెక్షన్లు వెంటనే మంజూరు చేసి త్వరితగతిన పనులు పూర్తి చేస్తున్నామన్నారు. పీఎం సూర్య ఘర్ పథకంను సద్వినియోగం చేసుకోవాలన్నారు.త్రీ కిలో వాట్ కి ప్రభుత్వం రూ. 78 వేలు రాయితీ ఇస్తుందన్నారు. అదనపులోడు 50 శాతం రాయితీ పొందటానికి ఈనెల 31 వరకు అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ పథకాలను సక్రమంగా వినియోగించుకుంటే కరెంట్ బిల్లు ఆదావు అవుతుందన్నారు. ఏడిఈ బి వెంకటేశ్వర రెడ్డి, ఏఈఈ ఎస్ గాంధీ బాబు, లైన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.


ప్రాంగణ ఎంపికలో కృష్ణవేణి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

నరసరావుపేట లోని కష్ణవేణి డిగ్రీ కళాశాలలో గురువారం ఐఈసిఈ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో 69 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాదించారని కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. నాతాని మాట్లాడుతూ ప్రాంగణ ఎంపికలలో మొత్తం 250 మంది విద్యార్థులు పాల్గొనగా సంస్థ హెచ్ఆర్ ప్రతినిధులు మల్లేష్, ప్రసాంత్‌లు విద్యార్థులకు గ్రూప్ డిస్కషన్, హెచ్ఆర్ రౌండ్ తదితర విభాగాలలో ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన 69 మంది విద్యార్థులు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల టిపిఓ ఎం.బాల కోటేశ్వరరావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ఘనంగా కొణిజేటి రోశయ్య వర్ధంతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మాజీ ముఖ్యమంత్రి తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. సత్తెనపల్లి వావిలాల గోపాలకృష్ణయ్య మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద ఉన్న రోశయ్య విగ్రహానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్రానికి రోశయ్య చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొల్లిపర కాశీ విశ్వనాథం, ఆతుకూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుర్గి : కొణిజేటి రోశయ్య నాలుగో వర్ధంతి దర్గిలో ఘనంగా నిర్వహించారు. మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ పోలూరి నరసింహారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో రోశయ్యది గొప్ప పాత్ర అన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ రీజియన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, మున్సిపల్ కౌన్సిలర్ పోలా శ్రీనివాసరావు, వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ వ్యవస్థాపక అధ్యక్షులు తిరువీధి వెంకట నాగేశ్వరరావు, సింగాల సుధాకర్ రెడ్డి, కంభంపాటి అమర్, చుండూరు సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు..

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్థానిక శివుని బొమ్మ సెంటర్లోని రోశయ్య కాంస్య విగ్రహానికి జిల్లా వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి రోశయ్య అందించిన సేవలరె కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు, వైఎస్ఆర్‌సిపి నరసరావుపేట వర్కింగ్ ప్రెసిడెంట్ నిడమానూరి సురేంద్ర, నాయకులు అన్నా చంద్రమోహన్, కొత్తూరి కిషోర్ బాబు, కొత్త మాసు మల్లారావు, దివ్వెల రామకఅష్ణ, మిట్టపల్లి శేఖర్, బత్తుల విష్ణువర్ధన్ రావు, పాదర్తి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించిన ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల

ప్రజాశక్తి-నాదెండ్ల



పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

నరసరావుపేట మండలం కేసానుపల్లి గ్రామంలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. వారం రోజుల నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపులలో భాగంగా నాదెండ్ల మండలం కనపర్రు గ్రామంలో ఈ పోటీలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. కనపర్రు జిల్లా ఉన్నత పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐ.మోహనరెడ్డి మాట్లాడుతూ పిల్లలకు ఆరు బయట ఆటలు శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నాగమల్లేశ్వరరావు, ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ హెచ్.గంగాధం రావు మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బందిని కళాశాల చైర్మన్ షేక్. మీరావలి, సెక్రటరీ &కరస్పాండెంట్ కరీమ్ మోహిద్దీన్, మేనేజింగ్ డైరెక్టర్ షేక్. మస్తాన్ షరీఫ్ అభినందించారు.

హరి నాయక్‌ను అభినందించిన తహశీల్దార్

ప్రజాశక్తి - దుర్గి

గురజాల డివిజన్ పరిధిలో సర్వేల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలలో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పిడుగురాళ్ల మండల సర్వేయర్ జి. వెంకటేశ్వర్లను, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మాచర్ల మండలం కొప్పునూరు గ్రామ సర్వేయర్ మూడవత్ హరినాయక్‌ను తహశీల్దార్ కిరణ్‌కుమార్ గురువారం అభినందించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో హరినాయక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ సాల్మన్ రాజ్, రంగారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నేడు భూమి పూజ

దుర్గిలో 70లక్షల రూపాయల అభివృద్ధి పనులకు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శుక్రవారం శంఖుస్థాపన చేస్తారని టిడిపి నాయకులు సూరే వెంకటేశ్వర్లు, ఎల్లబోయిన గోపాల్, కోట వీరయ్య చౌదరి గురువారం విలేకరులకు తెలిపారు. వీటితో అంతర్గత రోడ్ల నిర్మాణం చేపడతారన్నారు. మాడ్డేలమ్మ గుడి నుండి శిల్పకళాశాల వరకు సిమెంట్ రోడ్ సైడ్ కాలువల నిర్మాణం, జంగాల కాలనీలో సిమెంట్ రోడ్ సైడ్ కాలువల నిర్మాణం, యాదవ బజారు లో సైడ్ కాలువల నిర్మాణం, తదితర పనులు చేపట్టనున్నారు.

సమస్యల పరిష్కారాన్ని కృషి

ప్రజాశక్తి - పెదకూరపాడు

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఎంపీడీవో సాయిలీల కోరారు. గురువారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మీరయ్య అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ అధికారులందరూ సకాలంలో హాజరు కావాలన్నారు. శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. జనవరిలో మరో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. తహసిల్దార్ ధనలక్ష్మి, వైస్ ఎంపీపీ బాషా, కార్యాలయ పర్యవేక్షకులు సోమయాజులు, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు. కొంతమంది అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు.



వైభవంగా మంచికల్లు తిరునాళ్ల

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని మంచికల్లు గ్రామ తిరునాళ్ల గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. వేకువజామునుంచే పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పోలేరమ్మ తల్లికి మహిళలు పొంగళ్లను సమర్పించి అమ్మవారి నుంచి దీవెనలను కోరారు. మాతంగి పోతురాజుల నృత్యాలు బాగా ఆసక్తిని రేకెత్తించాయి. సాయంత్ర వేళ గ్రామ పురవీదుల్లో శిడిమానను ఊరేగించారు. వివిధ రకాల సాంస్కఅతిక కార్యక్రమాలు నిర్వహించారు. పర్చూరు సమీపంలోని జాగర్లమూడికి చెందిన మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా ఉంది.రంగురంగుల విద్యుద్దీప కాంతులతో ఆలయం శోబిల్లింది. గురజాల డీఎస్పీ జగదీష్ నేతఅత్వంలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.పల్నాడు జిల్లా కలెక్టర్ కఅతికా శుక్లా,ఎస్పీ బి. కఅష్ణారావు, గురజాల, మాచర్ల ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డిలు తిరునాళ్ల వేడుకల్లో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామదేవతకు సారే సమర్పించారు. ఆలయ అర్చకులు వెంకటాచార్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

ఘనంగా పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల

ప్రజాశక్తి - గురజాల

పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల మహోత్సవ గురువారం పట్ణంలో ఘనంగా జరిగింది. తిరునాళ్లలో జిల్లా కలెక్టర్ కలెక్టర్ కృత్రిక శుక్ల, జిల్లా ఎస్పి బి.కృష్ణారావు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస్, ఆర్డీవో మురళీకృష్ణ, గురజాల డిఎస్పి జగదీష్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

సైన్స్ క్విజ్‌లో పసుమర్రు విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పసుమర్రు గ్రామంలోని మద్ది కామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి షేక్ మహమ్మద్ ముస్తాక్ పల్నాడు జిల్లా స్థాయిలో ఆన్‌లైన్‌లో జరిగిన కౌషల్ సైన్స్ క్విజ్ పోటీల్లో ద్వితీయ స్థానాన్ని సాధించి రాష్ట్ర స్థాయిలో తిరుపతి సంస్కృత యూనివర్సిటీలో ఈ నెల 27వ తారీఖున జరిగే కౌశల్ సైన్స్ క్విజ్ పరీక్షకు అర్హతను సాధించినట్టు పాఠశాల ప్రధా నోపా ధ్యాయులు వై. హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అలాగే ఈ విద్యార్థి ఈనెల 27వ రాష్ట్ర స్థాయిలో తిరుపతిలోని జరిగే కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలలో పాల్గొంటాడని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరానికి వెళ్లాలని, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు అభినందించారన్నారు.

రెండవ విడత భూసమీకరణతో వ్యవసాయం కనుమరుగు

ప్రజాశక్తి - తుళ్లూరు

రెండవ విడత భూ సమీకరణతో మండలంలో వ్యవసాయం కనుమరుగవ నుంది. మండలంలో మొత్తం 21 గ్రామాలుండగా (రెండు శివారు గ్రామాలతో కలిపి) 2015లో రాజధాని నిర్మాణానికి ప్రభుత్వం భూసమీకరణ చేపట్టింది. కేవలం మూడు గ్రామాలు వడ్డమాను, హరిశ్చంద్ర పురం, పెదపరిమి గ్రామాలను భూ సమీకరణ నుంచి మినహాయించింది. తాము కూడా రాజధాని నిర్మాణానికి భూములిస్తామని కొంతమంది పెదపరిమి రైతులు చెప్పినప్పటికీ మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ అప్పట్లో అంగీకరించలేదు. మొదట భూములిచ్చిన 29 గ్రామాల రైతుల భూములను అభివృద్ధి చేసిన తర్వాతే మరోచోట భూములు తీసుకునే విషయం గురించి ఆలోచిస్తామని చెప్పుకొచ్చారు. దీంతో మూడు గ్రామాలలో వ్యవసాయ ప్రక్రియ సాగుతోంది. మూడు గ్రామాలతో పాటు భూసమీకరణలో ఇవ్వని సుమారు 3వేల ఎకరాలలో రైతులు పంటలు పండిస్తున్నారు. రెండవ విడత భూసమీకరణలో పెదపరిమిలో 6,513 ఎకరాలు, హరిశ్చంద్ర పురంలో 2,428, వడ్డమానులో 1,937 ఎకరాలను ప్రభుత్వం తీసుకుంటా నని చెబుతోంది. వీటితో పాటు భూసమీకరణలో ఇవ్వని భూములను భూసేకరణలో తీసుకుంటామని పదేపదే చెబుతోంది. ఇదే జరిగితే వ్యవసాయం దాదాపు లేనట్లే. తొలి విడత భూ సమీకరణలో తీసుకున్న భూములను అభివృద్ధి చేశాకే రెండవ విడత భూ సమీకరణపై నిర్ణయానికి వస్తామని చెప్పిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహ రిస్తోంది. రైతుల అభిప్రాయాలను కాదని భూములు తీసుకునేందుకు ముందుకెళు తోంది. రెండవ విడత భూసమీకరణ అంటూ ఈ ఏడాది మే లో వడ్డమాను, పెదపరిమి, హరిశ్చంద్రపురంలో ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ సారధ్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఆసభల్లో భూసమీకరణకు రైతులు అంగీకరించలేదు. తొలివిడత భూములిచ్చిన రైతుల ప్లాట్లలో అభివృద్ధి లేదని, అక్కడి రైతులు ఉద్యమాలు చేశారని, ప్రభుత్వం మారితే మా గతేంటి.. లాంటి ప్రశ్నలను సభల్లో రైతులు సంధించారు. దీంతో మలి విడత భూసమీకరణ నుంచి వెనకడుగు వేసిన ప్రభుత్వం తిరిగి ఆరునెల వ్యవధిలో మళ్ళీ భూములు తీసుకునేందుకు భూ సమీకరణకు సిద్ధమైంది. మండలంలోని మూడు గ్రామాలతో పాటు అమరావతి మండలంలో మరో నాలుగు గ్రామాల్లోని భూములను సమీకరిస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ గురువారం నుంచి మొదలైంది. తుళ్లూరు మండలంలో మొత్తం 47,114 ఎకరాల వ్యవసాయ (రాజధాని నిర్మాణానికి ముందు) భూములుండగా వాటిలో సాగుకు అనువైన భూములు 35,950 ఎకరాలు. తొలివిడత లో ప్రభుత్వం 20 వేలకు పైగా భూములను తీసుకుంది. మూడు గ్రామాల్లోని భూములను కూడా రాజధాని విస్తరణ పేరుతో భూసమీకరణలో తీసుకోనుండడంతో ఆయా గ్రామాల్లో వ్యవసాయ కూలీలు, చేతి వృత్తిదారుల జీవనం ఎలా అన్నది చర్చనీయాంశమైంది.



తుళ్లూరు మండలం వడ్డమానులో సాగవుతోన్న పత్తి

డిడిఎల్ఓ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి మనోహర్

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక 10వ వార్డులో నూతనంగా ఏర్పాటుచేసిన డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కార్యాలయాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం ప్రారంభించారు. రాష్ట్రంలో రెవెన్యూ డివిజన్లు పెంచిన కారణంగా డివిజనల్ డెవలప్మెంట్ అధికారిని కేటాయించిన విషయం తెలిసిందే. తెనాలికి కేటాయించిన డిడిఎల్ఓ కార్యాలయాన్ని తొలుత ట్రావెల్స్ బంగ్లా ఆవరణలోని పాత మీసేవ కేంద్రంలో ఏర్పాటు చేశారు. అయితే అది మంత్రి మనోహర్ ఆదేశాలతో వివిధ అవసరాలకు మళ్లించిన నేపథ్యంలో 10వ వార్డులో సచివాలయం సమీపంలో డిడిఎల్ఓ కార్యాలయానికి భవనాన్ని కేటాయించారు. ఆ భవనానికి అవసరమైన మరమ్మతులు పూర్తయిన నేపథ్యంలో కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్యావల్ విధానంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో మనోహర్ మాట్లాడారు. కార్యక్రమంలో డిడిఎల్ఓ కుసుమ శ్రీదేవి, జిల్లాపరిషత్ సీఈవో వీర్ల జ్యోతిబసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి జగన్నాధం పార్థ సారధి, తహశీల్దార్ కె.వి.గోపాలకృష్ణ, డి.ఎల్.పి.ఓ స్వరూప రాణి, ఎం.పి.డి.వో అత్తోట దీప్తి, పంచాయతీ రాజ్ ఈఈ గుప్తా, పలువురు నాయకులు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మనోహర్

చినకాకానిలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని చినకాకాని గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. నాలుగు రోజుల నుండి గ్రామంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం ఆఫీసర్ యర్రగుంట్ల ప్రేమ్ రాజ్ తెలిపారు. మంగళగిరి వీటిజే ఎం అండ్ ఐ వి టి ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం సామాజిక ఆర్థిక సర్వేను నిర్వహించి నట్లు చెప్పారు. ప్రజలు తెలిపిన వివిధ రకాల అంశాలను సమస్యలను నమోదు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా జనసేన నాయకులు జొన్నా రాజేష్ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - మంగళగిరి

జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ నాయకులు జన్న రాజేష్ పుట్టిన రోజు వేడుకలను గురువారం కాపు సంఘ రాష్ట్ర నాయకులు తోట సాంబశివరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కాపు కార్పొరేషన్ డైరెక్టర్ విన్నకోట శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ టిడిపి నాయకులు రంగిశెట్టి నరేంద్ర (బాబి) హాజరై రాజేష్ చేత కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘ నాయకులు మిరియాల సత్యనారాయణ, నిమ్మల నాగేశ్వరరావు, కోన మల్లేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

కొణిజేటి రోశయ్య సేవలు నిరుపమానం

ప్రజాశక్తి - మంగళగిరి

డాక్టర్ కొణిజేటి రోశయ్య తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్ గానూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా విశేష సేవలందించారని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగ్ అధ్యక్షుడు దేవతి భగవన్నారాయణ అన్నారు. డాక్టర్ కొణిజేటి రోశయ్య నాలుగో వర్ధంతి సందర్భంగా గురువారం ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వామ్ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ గాదంశెట్టి సుజాత, వామ్ అదనపు కార్యదర్శి మాజేటి సూర్య వేణుగోపాలకృష్ణ శ్రేష్ఠి, లక్ష్మీనరసింహా ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు మేకల మోహనరావు, వామ్ ప్రతినిధులు గాదంశెట్టి రామకృష్ణ, మద్ది భాగ్యలక్ష్మి, పసుమర్తి మురళీకృష్ణ, నేరెళ్ల లక్ష్మణరావు, భోజనపల్లి తాండవకృష్ణ, గార్లపాటి శ్రీనివాసరావు, నల్లగొండ మల్లికార్జునరావు పాల్గొన్నారు. అనంతరం రోశయ్య జ్ఞాపకార్థం పలువురు మహిళలకు చీరలు పంపిణీచేశారు.

ప్రజాశక్తి - తెనాలి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతిని పట్టణ ప్రముఖులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన నివాళులర్పించారు. స్థానిక బోసురోడ్డులో రోశయ్య విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తాడిపోయిన రాధిక, మాజీ చైర్పర్సన్ పెండ్యాల వెంకటరావు, డబుల్ హార్స్ మినప గుళ్ళు అధినేత మునగాల మోహన శ్యాంప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వివిఐటియులో శంబాల చిత్ర బృందం సందడి



ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని నంబూరు గ్రామంలోని వివిఐటియులో గురువారం శంబాల చిత్ర బృందం తమ సినిమా ప్రచార కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో సందడి చేశారు. యువ నటుడు ఆది సాయికుమార్, అర్చన అయ్యర్, స్వశిక ప్రధాన పాత్రలలో యుగంధర్ ముని దర్శకత్వం లో రూపొందించబడిన థ్రిల్లర్ " శంబాల ". ఈ చిత్రం నెల 25న విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రచార కార్యక్రమంలో భాగంగా వివిధ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. ఈ కార్యక్రమంలో వివిఐటియు రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని పెదవడ్లపూడి గ్రామంలో రైతు సేవ కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోలు కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ కార్యక్రమాన్ని ప్రారంభించి, రైతుల నుంచి స్వీకరించిన తొలి ధాన్య లోడ్‌ను ఆత్మకూరు శంకర్ మిల్‌కు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు యేళ్ళ శివరామయ్య, మాదల రమేష్ బాబు, కనపాల ఆనంద్ సాగర్, మొద్దుకూరి రమేష్, జాలాది సందీప్, పత్రా శ్రీనివాసరావు, అందుగుల అబ్రహం, రైతు భరోసా సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

సాయి మందిరంలో దత్త హోమం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

పెదవడ్లపూడి భగవాన్ సత్య షిరిడి సాయిబాబా మందిరంలో దత్తాత్రేయ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మందిరం ఆధ్వర్యంలో శ్రీదేవి సమేత దత్తాత్రేయస్వామి వారి హోమం, ప్రత్యేక పూజలు గురువారం నిర్వహించారు. మందిరం నిర్వాహకులు పాతూరి శ్రీనివాసరావు, రాధిక దంపతులు, పాతూరి సుధారాణి పూజలు నిర్వహించారు. మందిరం నిర్వాహకురాలు సుధారాణి మాట్లాడారు. దక్షిణామూర్తి ప్రథమ గురువు అంటారని, ఆ తర్వాత దత్తాత్రేయ స్వామి వారే గురువు అన్నారు. దక్షిణామూర్తి మాదిరిగానే మౌనంలోనే భక్తులకు దత్తాత్రేయస్వామి జ్ఞానోపదేశం చేశారన్నారు. సామాన్య గృహస్థులు యోగంలో ఏ విధంగా మోక్షాన్ని చేరుకోవాలో దత్తాత్రేయస్వామి వారిని అనుసరించడం వల్ల తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తబృందం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న నిర్వాహకులు



కౌన్సిలింగ్ ఇస్తున్న డిఎస్పి

వీధి వ్యాపారులకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో తోపుడుబండ్లపై వ్యాపారాలు నిర్వహిస్తున్న చిరు వ్యాపారులకు డిఎస్పి బి.జనార్దన రావు గురువారం కౌన్సిలింగ్ నిర్వహించారు. పట్టణ వన్ టౌన్, టు టౌన్, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పలు చోట్ల రోడ్లపై తోపుడుబండ్లపై వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని పట్టణ ఒన్ టౌన్ సీఐ మల్లికార్జున రావు ఆధ్వర్యంలో స్టేషన్ కు పిలిపించారు. వారితో డిఎస్పీ మాట్లాడారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించే విధంగా రోడ్లపై వ్యాపారాలు తగవని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

సిఎం ఆర్ ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి- తాడేపల్లి

అనారోగ్యంతో బాధపడుతున్న వారి వైద్యఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు గురువారం నలుగురికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, అద్దంకి మురళి, మేకా పుల్లారెడ్డి, కేశీ వెంకటేశ్వరరావు, ఇట్టా భాస్కర్, మంగళగిరి మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ మస్తాన్, పోతాబత్తిన శ్రీనివాసరావు , కొర్రపాటి విజయ్, బాబూరావు, షేక్ చాంద్ బాషా, షేక్ నాగులు మిరా, షేక్ భాషా, షేక్ జిన్నా, సంక్రాంతి అశోక్, దొడ్డపాటి వేంకటేశ్వర రావు, గాజుల కృష్ణ, గంగాధరరావు, పువ్వుల హనుమంతు, హనుమయ్య, రాజు, దోన కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



ఏపీఐఐసీ దీక్ష చేస్తున్న ఎస్సీ మహిళా పారిశ్రామికవేత్త కుటుంబం

సబ్సిడీ విడుదల చేయాలని దీక్ష

ప్రజాశక్తి - మంగళగిరి

ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టి పారిశ్రామికవేత్తలకు కూటమి ప్రభుత్వం సబ్సిడీ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మంగళగిరి పట్టణంలో గల ఏపీఐఐసీ భవనం వద్ద కోనసీమ జిల్లా అమలాపురం చెందిన కె.శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు దీక్ష చేపట్టారు. కుటుంబంలో ఉన్న భార్య, ఇద్దరు పిల్లలతో దీక్షలో పాల్గొన్నారు. నాలుగేళ్లుగా 42 లక్షల రూపాయలు సబ్సిడీ విడుదల చేయాల్సి ఉందని ఇంతవరకు విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక పర్యాయములు ఇక్కడకు వచ్చి వినతి పత్రాలు అందజేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. సిఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పట్టించుకొని సబ్సిడీ చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, దయాకర్ పాల్గొన్నారు.

జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తెనాలి

రూరల్ పరిధిలోని అంగలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ టు విద్యార్థులు క్రీడలలో రాష్ట్రస్థాయిలో సత్తా చాటారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.అనురాధ గురువారం వెల్లడించిన వివరాల ప్రకారం పవర్ లిఫ్టింగ్ లో రాష్ట్ర స్థాయిలో మూడు ప్రథమ, ఒక ద్వితీయ, తృతీయ స్థానాన్ని సాధించారని చెప్పారు. క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థు లను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు వేమూరి శరత్ బాబు, పులివర్తి రవిరాజు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ప్రజలకు మరింత చేరువగా పంచాయతీరాజ్ వ్యవస్థ

డిడిఒ కార్యాలయం ప్రారంభోత్సవంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-గుంటూరు


ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులు

పరిపాలన సౌలభ్యం కోసం డివిజనల్ డెవలప్ మెంట్ ఆఫీసర్, డివిజనల్ పంచాయతీ ఆఫీసు, గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయాలను ఒకే చోట ఏర్పాటు చేయటం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. గురు వారం జెడ్పీ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డిడిఓ ఆఫీసు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, రాష్ట్ర పంచాయతీరాజ్ అదనపు కమిషనర్ నాగార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిడిఒ కార్యాలయం ఏర్పాటు చేయటం ద్వారా పరిపాలనా సౌలభ్యంతోపాటు, పరిపాలన వికేంద్రీకరణ జరుగుతుందని దస్త్రాలు త్వరితగతిన పరిష్కారం కావడానికి అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ఒకేసారి రాష్ట్రంలో 77 డీడీఓ కార్యాల యాలను ప్రారంభించడం శుభ సంకేతమని తెలిపారు. చిత్తూరు నుండి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ డిడిఒ ఆఫీసుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు.కార్యక్రమంలో జెడ్పీ సి.ఇ.ఒ వి.జ్యోతిబసు, డి.ఆర్.డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ టి. విజయ లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి.నాగసాయికుమార్ పాల్గొన్నారు.

పోస్ట్‌మాన్ల సంఘం జాతీయ ఉపకార్యదర్శిగా విద్యాసాగర్

ప్రజాశక్తి-గుంటూరు



అఖిలభారతపాల ఉద్యోగుల సంఘం పోస్ట్‌మాన్ అండ్ ఎంటిఎస్ సంఘం జాతీయ ఉప కార్యదర్శిగా ఆంధ్రప్రదేశ్ నుండి పి4 సంఘం అధ్యక్షులు చుక్కా విద్యాసాగర్ ఎన్నికయ్యారు. నవంబర్ 30, డిసెంబర్ 1, 2 తేదీల్లో ఒరిస్సాలోని పూరీలో జరిగియన మహాసభల్లో వరుసగా నాల్గవ సారి విద్యాసాగర్ ఉపకార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అఖిలభారతపాల ఉద్యోగ సంఘాలు విద్యాసాగర్‌కు అభినందనలు తెలియ జేశాయి.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సెక్రెటరీ, ప్రిన్సిపాల్

26, 27 తేదీల్లో ఆర్‌విఆర్ జెసిలో కొలరిడో

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో డిసెంబర్ 26, 27 తేదీల్లో కొలరిడో 2కె 25 పేరుతో జాతీయస్థాయి సాంకేతిక, సాంస్కృతిక, క్రీడా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని తెలిపారు. గురువారం ఫెస్ట్ పోస్టర్‌ను, వెబ్‌సైట్‌ను కాలేజి సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, సిబ్బంది ఆవిష్కరించారు. జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో సాంకేతిక, సాంస్కృతిక, క్రీడా విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు దేశ నలుమూలల నుండి పాల్గొంటారని తెలిపారు. విజేతలకు రూ.5 లక్షల వరకు నగదు బహుమతులు, మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేస్తామని సెక్రెటరీ రాయపాటి గోపాలకష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. విద్యార్థుల నూతన ఆవిష్కరణలకు, సాంస్కృతిక కళలకు, క్రీడలకు ఈ మహోత్సవం ఒక అద్భుత వేదికగా నిలుస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన విద్యార్థులు కళాశాల ప్రత్యేక వెబ్‌సైట్ https://rvrjcce.ac.in/colorido2K25 ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి. శ్రీనివాసరావు, కల్చరల్ కమిటీ కన్వీనర్ రంగరాయ చౌదరి, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లబర్లీ సాగుకు విరామం పాటించాలి

ప్రజాశక్తి-గుంటూరు


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

నల్లబర్లీ పొగాకు సాగుపై ప్రభుత్వం విధించిన పంట విరామం ప్రతి ఒక్కరూ పాటించాలని గుంటూరు రూరల్ మండల వ్యవసాయాధికారి బి.కిషోర్ అన్నారు. గురువారం నల్లబర్లీపై సాగు విరామంపై మండలంలోని గొర్లవారి పాలెంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ రబీ సీజన్‌లో నల్లబర్లీ పొగాకు సాగుపై రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో 740 ప్రకారం పంట విరామం/నిషేధం అమల్లో ఉందని తెలిపారు. ఇప్పటికే గుంటూరు రూరల్ మండలంలోని పొగాకు సాగు చేసే అన్ని గ్రామాల్లో కూడా బ్లాక్‌బర్లీ పొగాకు పంట నిషేధం గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు.రైతులు ప్రభుత్వ ఆదేశాలను పాటించి బ్లాక్ బర్లీ సాగుకు దూరంగా ఉండాలని కోరారు. క్రాప్ హాలిడే అమలుకు మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ బందం సమర్థంగా పనిచేస్తుందని చెప్పారు. నిషేధాన్ని అతిక్రమించి ఎవరైనా నల్లబర్లీ పంటను సాగు చేస్తే, టాస్క్ ఫోర్స్ టీంలో ఉన్న తహసీల్దార్ (చైర్మన్), మండల వ్యవసాయ అధికారి (కన్వీనర్), ఎస్‌ఐ, మెడికల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు నల్లబర్లీకి బదులుగా ప్రత్యామ్నాయ పంటలైన శనగ, మినుము, మొక్కజొన్న ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎ.అమూల్య, రైతులు పాల్గొన్నారు.

నేడు ప్రతి పాఠశాలలో మెగా పిటియం

ప్రజాశక్తి-గుంటూరు


సమాశంలో మాట్లాడుతున్న కలెక్టర్

మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను నేడు జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం పెద్ద ఎత్తున నిర్వహిండం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. మెగా పి.టి.యంపై కలెక్టర్ కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడారు. ప్రతి పాఠశాలలో పండుగ వాతావరణంలో సమావేశం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈకార్యక్రమంలో తల్లిదండ్రులు ఇద్దరు పాల్గొనాలని కోరారు. పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, దాతలు, ఇతర ప్రజాప్రతి నిధులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు అందరూ పాల్గొంటారని తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి పాఠశాలలో చేపట్టుతున్న కార్యక్రమాలు, ఉపాధ్యాయులు ప్రగతి నివేదన పత్రాన్ని తల్లిదండ్రులకు ఇచ్చి విద్యార్థి ప్రగతిని వివరిస్తారని, ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన అసెస్‌మెంట్ పుస్తకాలలో నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక పరీక్షల పుస్తకాలను తల్లిదండ్రులకు పరిశీలనా నిమిత్తం ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాల ప్రగతి నివేదికను సమావేశంలో తెలియజేస్తారని, పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సంసిద్ధతకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న 100 రోజులు కార్యక్రమం వివరాలను తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరిస్తారని చెప్పారు. పాఠశాల కమిటీ సభ్యులు, అతిథులు, దాతలు పాఠశాల ప్రగతికి చేపట్టవలసిన కార్యక్రమాలను చర్చిస్తారని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనాన్ని అందరూ స్వీకరించిన తరువాత కార్యక్రమం ముగుస్తుందన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలపై ఉదయం 11 గంటల వరకు చర్చిస్తారని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ పాల్గొని విద్యార్థుల సర్వతో ముఖాభివద్ధికి, పాఠశాల పురోగతికి తగిన సలహాలు, సూచనలు అందించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవితను తీర్చిదిద్దుటకు ఒక గొప్ప కార్యక్రమం అన్నారు. జిల్లాలో విజయవంతంగా నిర్వహించే ఆదర్శంగా నిలవాలని అన్నారు. తల్లిదండ్రులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఇరవై సూత్రాల కార్యక్రమల అమలు (స్వర్ణాంధ్ర - వికాసిత్ భారత్) చైర్మన్ లంకా దినకర్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో ప్రథమ స్థానంలో నిలవాలి

ప్రజాశక్తి-గుంటూరు


సమావేశంలో మాట్లాడుతున్న లంకా దినకర్

విద్యా - వైద్య స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో గుంటూరు జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవాలని ఇరవై సూత్రాల కార్యక్రమల అమలు (స్వర్ణాంధ్ర - వికాసిత్ భారత్) చైర్మన్ లంకా దినకర్ అన్నారు. గురువారం జిల్లా పర్యటనకు విచ్చేసిన చైర్మన్ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి వైద్య ఆరోగ్య శాఖ, విద్యా శాఖ, మౌళిక సదుపాయాల కల్పన శాఖలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాల స్ఫూర్తిని పూర్తిస్థాయిలో అర్థంచేసుకుంటూ అభివృద్ధి దిశగా అడుగులు వేయడం ప్రధానమని.. ఈ నేపథ్యంలో స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి కార్యక్రమం అమలు కావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.వైద్య ఆరోగ్యం, విద్యకు సంబంధించిన పథకాలు, అమత్ 1.0, అమృత్ 2.0, జల్ జీవన్ మిషన్, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్‌లపై ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పీఎం మాతృవందన యోజన, జననీ సురక్షా యోజన, జననీ శిశు సంరక్ష కార్యక్రమం, రాష్ట్రీయ కిషోర్ స్వస్త కార్యక్రమం, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం, ఆయుష్మాన్ భారత్ - ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, ఎన్టీఆర్ వైద్య సేవ, తల్లికి వందనం, డొక్కా సీతమ్మ భోజన పథకం, పీఎం శ్రీ తదితర పథకాలతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించే జల్ జీవన్ మిషన్, అమత్ పథకాలకు సంబంధించిన అంశాలపై సమీక్షించి, పురోగతికి అవసరమైన కార్యాచరణపై సూచనలు చేశారు. బహుళ ప్రయోజనాల పీఎం సూర్యఘర్ పథకం అమల్లోనూ మరింత చొరవ చూపాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎన్.ఎస్.కె.ఖాజావలి, ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.రమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.విజయ లక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీర్ కె.కళ్యాణ చక్రవర్తి, ముఖ్య ప్రణాళిక అధికారి శేష శ్రీ పాల్గొన్నారు.

9న మాదాల నారాయణస్వామి వర్ధంతి సభ

ప్రజాశక్తి-గుంటూరు

మాదాల నారాయణస్వామి 12వ వర్ధంతి సభను ఈనెల 9న గుంటూరు రెవెన్యూ కళ్యాణ మండపంలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం స్థానిక ఎస్‌హెచ్‌ఒ హాల్లో సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిల భారత రైతుకూలీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వేల్పూరి నరసింహారావు మాట్లాడుతూ నారాయణస్వామి అంతిమ శ్వాస వరకు భూమి భుక్తి విముక్తి సాధన కోసం కషి చేశారని దానివలన జిల్లాలో రాష్ట్రంలో వందలాది మంది పేద ప్రజలు భూములు సాధించుకొని సాగు చేసుకుంటున్నారని ఆయన సందర్భంగా గుర్తు చేశారు. సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎన్.విష్ణు మాట్లాడుతూ మాదాల నారాయణస్వామి ఉత్తమ విలువలను నేటితరం స్వీకరించాలని అన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు నాగేశ్వరావు పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణం తర్వాతే రోడ్లు నిర్మించాలి

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో నూతనంగా నిర్మించే రోడ్లను డ్రైన్ల నిర్మాణం తర్వాతే చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. గురువారం స్తంభాలగరువు, బ్రాడీపేట, అరండల్‌పేటలోని పలు ప్రాంతాలను పర్యటించి పారిశుధ్య, అభివద్ధి పనులను పరిశీలించి, సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో డ్రైన్‌లు ఏర్పాటు చేయకుండా రోడ్లు నిర్మాణం చేయడం వలన వర్షాలకు రోడ్లు నీరు నిలిచి మరమ్మతులకు గురువుతున్నాయన్నారు. కనుక రోడ్లతోపాటు డ్రైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. డ్రైన్ల ఆక్రమణలపై పట్టణ ప్రణాళిక అధికారులు కఠినంగా ఉండాలని, ఎక్కడైనా ఆక్రమణలు గుర్తిస్తే సంబంధిత ప్లానింగ్ కార్యదర్శి, టిపిబీఓపై చర్యలు తీసుకుంటామన్నారు. అరండల్‌పేట ఒకటవ లైన్‌లో డ్రైన్ ఓవర్‌ఫ్లోపై ప్రజల నుండి అందిన ఫిర్యాదు మేరకు పరిశీలించి, తక్షణం చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. అనంతరం స్తంభాల గరువు మహాప్రస్తానంని పరిశీలించి, జిఎంసి నుండి తీసుకోవాల్సిన చర్యలపై ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో ఈఈ వేణుగోపాల్, ఏ సిపి రెహ్మాన్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరిస్తాం : భాష్యం ప్రవీణ్

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి మండలం యండ్రాయి గ్రామంలో గురువారం పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పర్యటించారు. గ్రామంలో ప్రజలను కలుసుకున్నారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల వద్దకు ప్రవీణ్ కార్యక్రమంలో భాగంగా 100 రోజులు - 100 గ్రామాలు" కార్యక్రమంలో 10 వ రోజు ఆయన యండ్రాయి గ్రామం వచ్చారు. సమస్యలను స్వయంగా విని, వెంటనే పరిష్కా రం కోసం సంబంధిత శాఖల అధికారు లకు ఆదేశాలు జారీ చేశారు. రానున్న రోజుల్లో ప్రభు త్వం అమలు చేయనున్న అభివద్ధి కార్యక్ర మాలు, సంక్షేమ పథకాలు, గ్రామాభివృద్ధి చర్యలను ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యల ను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు.

